క్లుప్తంగా

బంగారం, వెండి చోరీపై కేసు

కాళ్ల: కాళ్ల మండలం సీసలి గ్రామంలో చోరీపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. సీసలికి చెందిన వాస్కూరి పవన్ మణికంఠ ఈనెల 8న బర్తడే ఫంక్షన్‌కు కుటుంబ సభ్యులతో కలిసి వేరే ప్రాంతానికి వెళ్లారు. 9వ తేదీ సాయంత్రం ఇంటికి వచ్చేసరికి తలుపులు తీసి ఉన్నాయి. రూ.60 వేల విలువైన బంగారం, 100 గ్రాములు వెండి చోరీకి గురైనట్టు గుర్తించిన మణికంఠ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఏజీఎస్ మూర్తి తెలిపారు.

కొండేపూడిలో వేప,రావి చెట్లకు కల్యాణం

పాలకోడేరు: మండలంలోని కొండేపూడి గ్రామంలో గ్రామస్తులు సహకారంతో వరసిద్ధి వినాయక ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయి బాబా, శ్రీ ఆంజనేయ స్వామి, శివుడు పార్వతి విగ్రహాల ప్రతిష్ఠ శనివారం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. అందులో భాగంగా శుక్రవారం లక్ష్మీనారాయణ స్వరూపమైన వేప రావి చెట్లకు కల్యాణం జరిపించారు. హోమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గ్రామ సుభిక్షంగా ఉండేందుకు విగ్రహాల ప్రతిష్ఠ ముందు కల్యాణ జరిపించామన్నారు. శని వారం విగ్రహ ప్రతిష్ఠ అనంతరం అఖండ అన్న సమారాధన నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులంతా పాల్గొని స్వామివారి తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

దుర్గమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

కాళ్ల: మాఘమాసం మూడో శుక్రవారం సందర్భంగా కోమటిగుంట గ్రామంలో ఉన్న దుర్గాదేవి అమ్మవారి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి అమ్మవారి ఆలయంలో సహస్ర నామ కుంకుమార్చన పూజలు నిర్వహించారు. గ్రామానికి చెందిన పానకాల సత్తియ్య, నాగలలిత దంపతులతో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో అఖండ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం కావడంతో అమ్మవారి ఆలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున మహిళా భక్తులు హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఏర్పాట్లను ఆలయ నిర్మాణకర్త ఎరుబండి రామాంజనేయులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలు

ఆకివీడు: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ శుక్రవారం నుంచి అమలులోకి వచ్చిందని తహసీల్దార్ ఎన్.వెంకటేశ్వరరావు చెప్పారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, సచివాలయ కార్యదర్శులతో ఎన్నికల నిబంధనలపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కోడ్ అమలులో ఉన్నందున అధికారులు, సిబ్బంది రాజకీయ సమావేశాలకు హాజరుకాకూడదని హెచ్చరించారు. రాజకీయ బ్యానర్లను తొలగించి, విగ్రహాలకు ముసుగులు వేయించాలని ఆదేశించారు. ఈ నెల 16న ఎమ్మెల్సీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల అవుతుందని చెప్పారు. మార్చి 13న ఎన్నికలు జరుగుతాయని, 16న కౌంటింగ్ జరుగుతుందని తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎస్ఎస్.శ్రీకర్, డిప్యూటీ తహసీల్దార్ రాజకిషోర్ పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సాక్షి, భీమవరం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై, రాజ్యాంగంపై వ్యాఖ్యలు చేసిన హమారా ప్రసాద్ పై తక్షణం దేశ ద్రోహం కేసు నమోదు చేసి వెంటనే అరెస్టు చేయాలని కేవీపీఎస్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. సోషల్ మీడియాలో హమారా ప్రసాద్ విడుదల చేసిన వీడియోలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై, రాజ్యాంగం పై మాట్లాడిన వ్యాఖ్యలను కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బత్తుల విజయకుమార్, కె.క్రాంతి బాబు ఖండిస్తూ శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. తక్షణం హమారా ప్రసాద్ వ్యాఖ్యలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠినంగా వ్యవహరించి అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

యాక్సిడెంట్ కేసులో వ్యక్తికి ఏడాది జైలు

నరసాపురం: దివ్యాంగుడైన బాలుడుని ట్రాక్టర్‌తో గుద్ది అతని మృతి కి కారణమైన కేసులో మొగల్తూరు మండలం కాళీపట్నంకు చెందిన కొత్తపల్లి నాగరాజు అనే వ్యక్తికి ఏడాది జైలు, రూ.2 వేలు జరిమానా విధిస్తూ నరసాపురం అడిషనల్ జ్యూడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కె.శ్రీనివాసరావు శుక్రవారం తీర్పు చెప్పారు. 2018 మార్చి 31న దివ్యాంగుడైన 14 ఏళ్ల మార్లపూడి ఏసురాజు తన ఇంటి సమీపంలోని ఖాళీ స్థలంలో ఆడుకుంటుండగా, ట్రాక్టర్‌తో మట్టి తోలుతున్న కొత్తపల్లి నాగరాజు వేగంగా వస్తూ ఏసురాజు మీద నుంచి ట్రాక్టర్ పోనిచ్చాడు. ప్రమాదంలో ఏసురాజు ఏలూరు ఆశ్రం ఆసుపత్రికి వైద్యం కోసం తరలిస్తుండగా చనిపోయాడు. నేరం రుజువు కావడంతో జడ్జి శిక్ష విధించినట్టు కోర్టు లైజన్ ఆఫీసర్, ఏఎస్సై ఉదయభాస్కర్ చెప్పారు.

ముగిసిన మావుళ్లమ్మ ఆలయ మహోత్సవాలు

- మావుళ్లమ్మకు మహా నివేదన
- 29 రోజులపాటు నిర్విరామంగా ఉత్సవాలు
- అన్నపూర్ణ దేవి అలంకరణలో మావుళ్లమ్మ


అమ్మవారి సన్నిధిలో భోజన ప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు


మావుళ్లమ్మ వారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం శ్రీమావుళ్లమ్మ అమ్మవారి వార్షిక మహోత్సవాలు ముగింపు సందర్భంగా అమ్మవారికి మహా నివేదన నిర్వహించారు. ఉదయం 7.30 నిమిషాలకు ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ప్రత్యేక పూజలు నిర్వహించి పలు రకాల పిండి వంటలు, పులిహోర, స్వీట్స్‌తో ఏర్పాటు చేసి మహా నివేదనను ఆయన అమ్మవారికి సమర్పించారు. ముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అఖండ అన్నసమారధన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉంటాయన్నారు. జనవరి 13న ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు 29 రోజుల పాటు ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అమ్మవారి ఆశీస్సులతో నీరుల్లి కూరగాయపండ్లు వర్తక సంఘం, ఉత్సవ కమిటీ విజయవతంగా మహోత్సవాలను నిర్వహిస్తున్నారన్నారు. ఏటా అమ్మవారి వార్షిక మహోత్సవాలను ఘనంగా నిర్వహించడం, అమ్మవారి ఉత్సవాలను తిలకించడానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తున్నారన్నారు. ఈ వార్షిక మహోత్సవాలు అమ్మవారి కీర్తిని ప్రతిష్టాలను పెంచుతున్నాయన్నారు. అమ్మ దయతో ముందు ముందు వార్షిక మహోత్సవాలు మరింత ఘనంగా నిర్వహించాలని కోరుకుంటున్నారన్నారు.

రూ.1.70 లక్షల పలికిన లడ్డు:
మావుళ్లమ్మ అమ్మవారికి ప్రసాదంగా సమర్పించిన 36 కేజీల లడ్డును వేలం పాట నిర్వహించగా పట్టణానికి చెందిన కొప్పుల రాంబాబు రూ.1.70 లక్షల దక్కించుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాబు, ఆలయ ఈఓ యర్రంశెట్టి భద్రాజీ, నీరుల్లి కూరగాయల పండ్ల వర్తక సంఘం సభ్యులు కొప్పుల సత్తిబాబు, రామాయణం గోవిందరావు, రామాయణం సత్యనారాయణ, దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ మానేపల్లి నాగేశ్వరరావు, పాలకవర్గ సభ్యులు ముత్యాల వెంకటరామారావు, చెల్లంకి నాగ శేషగిరి (గిరి), మావూరి సుందరరావు, తాళ్లపూడి భాగ్యలక్ష్మి, కోయ వెంకటలక్ష్మి, గోపిశెట్టి విజయలక్ష్మి, నీలాపు విజయ నాగలక్ష్మి, మద్దిరాల మల్లిఖార్జున శర్మ, సిరిపురపు శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

70 వేల మందికి అన్నదాన ప్రసాదం వితరణ
అమ్మవారి ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం అమ్మవారి ఆలయం వద్ద ఏర్పాటు నీరుల్లి కూరగాయ పండ్లు వర్తక సంఘం ఆధ్వర్యంలో భారీ అఖండ అన్నసమారాధన నిర్వహించారు. పలు రకాల పిండి వంటలు, స్వీట్స్, పలు రకాల వంటకాలతో భక్తులకు అన్నసమారాధన ఏర్పాటు చేయగా సుమారు 70 వేల మంది భక్తులు హాజరై అమ్మవారి భోజన ప్రసాదం స్వీకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్విరామంగా అన్నసమారాధన నిర్వహించారు. గురువారం రాత్రి నుంచే శుక్రవారం ఉదయం వరకు వంటలు చేసి భక్తులందరికి లేదు అనే మాట లేకుండా అన్నదాన ప్రసాదం వితరణ చేశారు. భారీగా భక్తులు తరలిరావడంతో జిల్లా ఎస్పీ యు.రవిప్రకాష్ ఆదేశాలతో భీమవరం డీఎస్పీ బి.శ్రీనాథ్ పర్యవేక్షణలో పలువురు సీఐలు, ఎస్సైలు, ఏఎస్సైలు, కానిస్టేబుల్స్ బందోబస్తు నిర్వహించి భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్నదాన ప్రసాదం స్వీకరించడారికి సహకరించారు. ఈ కార్యక్రమంలో నీరుల్లి కూరగాయపండ్లు వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటి సభ్యులు, దేవస్థాన అధికారులు పాల్గొన్నారు.

సబ్సిడీపై ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్

భీమవరం అర్బన్: దాళ్వా సాగులో 40 శాతం సబ్సిడీపై ట్రాక్టర్లు, పవర్ టిల్లర్స్ స్కీమ్ అందుబాటులో ఉందని ఆసక్తి ఉన్న రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి నిమ్మల శ్రీనివాస్ కోరారు. భీమవరంలోని వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. రైతులు సీహెచ్‌సీ గ్రూపులుగా ఏర్పడి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. వ్యవసాయాధిరిత గ్రామాల్లో ఆర్‌బీకే సెంటర్లలో యూరియా, డీఏపీ, పొటాసియమ్, ఇతర కాంప్లెక్స్ ఎరువులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ముగిసిన ఎస్ఎఫ్ఐ జిల్లా మహాసభలు

సాక్షి, భీమవరం: పట్టణంలో ఉన్న తాపీ పనివాళ్ల సంఘం భవనంలో ఎస్ఎఫ్ఐ 44వ జిల్లా మహాసభలు ఘనంగా ముగిశాయి. ఈ మహాసభలకు రాష్ట్ర కార్యదర్శి ఎ.అశోక్ ముఖ్యఅతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ఎస్ఎఫ్ఐ అనేక సంవత్సరాలుగా నిరంతరంగా కృషి చేస్తుందన్నారు. ఈ జిల్లాలో గత మహాసభ నుంచి ఈ మహాసభ వరకు జరిగిన కార్యక్రమాల గురించి జిల్లా కార్యదర్శి డి.పెద్దిరాజు కార్యకలాపాలను నివేదిక ప్రవేశపెట్టారు. ఈ మహాసభలో జిల్లా అధ్యక్షుడు పి.వాసు, ఉపాధ్యక్షుడు ప్రసాద్, నరసింహ, యుగంధర్, జాన్ పాల్గొన్నారు.

మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష


మహాశివరాత్రి పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్

సాక్షి, భీమవరం: మహాశివరాత్రి సందర్భంగా పంచారామ క్షేత్రాలలో ఒకటైన గునుపూడి శ్రీ సోమేశ్వర జనార్ధన స్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవాలు ఈ నెల 16 నుంచి 20 వరకూ జరుగుతున్న నేపథ్యంలో ఏర్పాట్లు ఘనంగా చేయాలని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆలయ అధికారులను, ధర్మకర్తల మండలిని ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం మహోత్సవాల పుస్తకాలను విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పంచారామ క్షేత్రం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తారని వెల్లడించారు. ఈ నేపథ్యంలో భక్తులకు త్వరితగతిన స్వామివారి, అమ్మవార్ల దర్శనం జరిగేలా ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అంతే కాకుండా దర్శనం టికెట్ల ధరలను ఎట్టి పరిస్థితుల్లోనూ పెంచవద్దని ఆదేశించారు. గతంలో ఉన్న దర్శనం టికెట్ల ధరల ప్రకారమే నడుచుకోవాలని అన్నారు. భక్తులకు పూర్తిస్థాయిలో అన్ని సదుపాయాలను కల్పించేందుకు ఎండోమెంట్స్, మున్సిపాలిటీ, రెవెన్యూ, పోలీస్, ఫైర్, విద్యుత్ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలని సూచించారు. తాగునీరు, శానిటేషన్ విషయంలో మునిసిపల్ అధికారులు తగిన ఏర్పాట్లను ముందుగానే చేసుకోవాలని, రెవెన్యూ, విద్యుత్, ఫైర్ లతో పాటుగా సంబంధిత అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి స్వామివారి కల్యాణ మహోత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, కార్యనిర్వహణాధికారి ఎం అరుణ్ కుమార్, ధర్మకర్తలు కుర్మదాసు సత్య శ్రీనివాస్, నాచు శ్రీవల్లి, లక్కు త్రిమూర్తులు, కోయ తాతాజీ, నల్లం రఘుబాబు, చెల్లబోయిన సూర్య ప్రకాష్, సోమాదుల లీలా ఈశ్వరి, తానాల రామకృష్ణ పాల్గొన్నారు.

రోడ్ల అభివృద్ధికి పటిష్ట చర్యలు
నియోజకవర్గంలో రోడ్ల అభివృద్ధికి పటిష్ట చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆయన క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం ఆర్అండ్‌బీ అధికారులతో నియోజకవర్గంలో ప్రస్తుతం జరుగుతున్న రోడ్ల అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భీమవరం నియోజకవర్గంలో ప్రతి రోడ్డును అభివృద్ధి చేస్తామన్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే రూ.10 కోట్లతో దిరుసుమర్రు గ్రామం నుంచి వెంప మెయిన్ రోడ్డు వరకు రోడ్డు నిర్మించామని తెలిపారు. వీరవాసరం మండలంలో మత్స్యపురి, పెనుమంత్ర నుంచి వీరవాసరం, పడమటి పాలెం నుండి తోలేరుకు రోడ్ల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో ఆర్అండ్‌బీ ఈఈ లోకేశ్వరరావు, డీఈ రామరాజు, జేఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జగనన్న చేతుల్లో ప్రజారోగ్యం పదిలం


యండగండి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల్లో ప్రజారోగ్యం పదిలంగా ఉందని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు అన్నారు. శుక్రవారం యండగండి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఎంపీపీ ఆధ్వర్యంలో ఆసుపత్రి అభివృద్ధిపై సమావేశాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజారోగ్యంపై ఎన్నో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుందని అన్నారు. నిరుపేదలకు సయితం కార్పొరేట్ వైద్యాన్ని అందిస్తుందన్నారు. గత ప్రభుత్వాలన్నీ ప్రజారోగ్యాన్ని గాలికి వదిలేశారన్నారు. ఇప్పుడు ప్రత్యేక దృష్టితో నాడు-నేడు కార్యక్రమాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహిస్తూ ఆపుపత్రి రూపురేఖలను మార్చేస్తున్నారన్నారు.ఎక్కడా అవినీతికి తావులేకుండా ఆసుపత్రులు నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతీ ఆసుపత్రిలోను పూర్తిస్థాయిలో మందులు అందుబాటులో ఉంచుతున్నారని, 108 అంబులెన్స్‌ల ద్వారా ఎంతో మంది గ్రామీణ ప్రజల ప్రాణాలు కాపాడుతున్నారన్నారు. 108 వచ్చిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లోని గర్భిణీలను కూడా సకాలానికి ఆసుపత్రులకు చేరుస్తున్నారని తద్వారా తల్లీబిడ్డలు కాపాడగలుగుతున్నామన్నారు. యండగండి పీహెచ్‌సీలో కావాల్సిన వైద్య పరికరాలు కొనుగోలుకు ఏర్పాట్లు చేసామని, ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్‌నర్స్ పోస్టులను త్వరలోనే డీఎంఅండ్‌హెచ్ఓతో మాట్లాడి సిబ్బంది కొరత తీరుస్తామని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి, వైద్యాధికారులు డి.బెన్నీసామ్యూల్, ఐసీ కీర్తన తదితరులు పాల్గొన్నారు.

మిస్టరీగా సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి


మణికంఠ వర్మ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/వనపర్తి: తెలంగాణ జిల్లా మేడ్చల్ జిల్లా బాచుపల్లి మండలం ప్రగతినగర్‌లోని మధురానగర్ కాలనీకి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మణికంతవర్మ (29) మృతి మిస్టరీగా మారింది. తన పెంపుడు కుక్కకు మందులు కొనేందుకు బుధవారం ఉదయం కారులో ఇంటి నుంచి బయలుదేరిన ఆయన వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలం జానంపేట శివారులోని రామసముద్రం చెరువులో గురువారం శవమై తేలడం అనుమానాలకు తావిస్తోంది. రామసముద్రం చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీసిన పోలీసులు సర్పంచ్ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిచెందినట్లు కేసు నమోదు చేశారు. శుక్రవారం ఉదయం 11 గంటల ప్రాంతంలో జిల్లా కేంద్రంలోని జనరల్ ఆస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అయితే ఆస్తి వివాదమే ప్రాణం తీసిందని మృతుడి కుటుంబసభ్యులు ఆరోపిస్తున్నారు. దీని వెనుక ఓ ప్రధాన పార్టీకి చెందిన నాయకులు ఉన్నారని చెబుతుండటం కలకలం సృష్టిస్తోంది. మృతుడి మణికంతవర్మ స్వస్థలం ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా భీమవరం. కాగా వారి కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడ్డారు. మృతుడి తల్లి విష్ణుప్రియ, అక్క అన్నపూర్ణదేవి ఆస్తి వివాదమే ప్రాణం తీసిందని.. ఈ వివాదం తప్ప మాకు ఎలాంటి సమస్యలు లేవని వారు రోదిస్తూ తెలిపారు. బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పేదల కుటుంబాల్లో 'కల్యాణమస్తు' వరం


పీవీఎల్ నర్సింహరాజు, డీసీసీబీ చైర్మన్

ఆకివీడు: శ్రీరస్తు, శుభమస్తు, కల్యాణమస్తు అంటూ పేద కుటుంబల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపుతున్నారని డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు చెప్పారు. వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా పథకం ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో సొమ్ము జమ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించిన సందర్భంగా శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కల్యాణమస్తు పథకం ద్వారా నియోజకవర్గంలో 28 మంది లబ్ధిదారులకు వారి ఖాతాల్లో సొమ్ము జమ చేశారని చెప్పారు. దరఖాస్తు చేసుకున్న మిగిలిన లబ్ధిదారులకు కూడా గడువు లోపు సొమ్ము జమ అవుతుందని చెప్పారు. ఆకివీడులో 4, కాళ్లలో 8, పాలకోడేరులో 7, ఉండిలో 9 మంది లబ్ధిదారులకు ప్రస్తుత త్రైమాసకంలో సొమ్ము జమైందన్నారు. దరఖాస్తు చేసుకున్న అర్హులకు మే నెలలో సొమ్ము జమ అవుతుందన్నారు. వధూవరుల వివాహమైన 30 రోజులలోపు పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రతీ ఏటా ఫిబ్రవరి, మే, ఆగస్టు, నవంబర్ నెలల్లో అర్హులైన లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందజేస్తారని చెప్పారు. బాల్య వివాహాల్ని అరికట్టి, అక్షరాస్యతా శాతాన్ని వృద్ధి చేసే విధంగా కల్యాణమస్తు పథకం లబ్ధిదారులు కనీసం 10వ తరగతి తప్పనిసరిగా చదువుకుంటేనే పథకానికి అర్హులని చెప్పారు. వధువు 18, వరుడు 21 ఏళ్లు తప్పనిసరిగా నిండి ఉండాలని నిర్ణయించారన్నారు. పథకం కోసం అర్హతతో దరఖాస్తు చేసుకుని, అన్ని ధ్రువీకరణ పత్రాలు సకాలంలో అందజేసిన వారికి పథకం మంజూరు అవుతుందని పీవీఎల్ చెప్పారు.

బాలసదన్‌కు చేరిన బాలిక


తప్పిపోయి బాలిక

ఆకివీడు: చిత్తు కాగితాలు ఏరుకుంటూ తిరుగుతున్న బాలిక గురువారం రాత్రి తెలగపాముల నివాస ప్రాంతాల్లోకి వెళ్లి ఆ ప్రాంతంలోని మేకా పార్వతి ఇంటి అరుగుపై రాత్రి పడుకుంది. తెల్లవారిన తరువాత పార్వతి బాలిక వద్దకు వచ్చి ఎవరు పాపవని అడిగినా సమాధానం చెప్పలేక అమ్మా, అమ్మా అంటూ బదులిచ్చింది. దీంతో ఆమెకు మాటలు సరిగా రావడంలేదని గుర్తించి, బాలికను పోలీస్ స్టేషన్‌కు తీసుకువెళ్లి పార్వతి అప్పగించింది. స్థానిక పోలీసులు ఆకివీడులోని మహిళా శిసు సంక్షేమ శాఖ అధికారులకు తెలియజేశారు. ఐసీడీఓస్ ప్రాజెక్టు ఇన్‌చార్జి అధికారిణి రత్నకుమారి, ఆమె సిబ్బంది బాలికను ఆమె తల్లిదండ్రులకు అప్పగించేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. బాలిక చెప్పిన ప్రాంతాలన్నింటికీ తిరిగినా ఫలితం దక్కలేదు. దీంతో రత్నకుమారి బాలిక విషయాన్ని జిల్లా చైల్డ్ ప్రొడక్షన్ అధికారి సూర్య చక్రవేణి, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సుజాతారాణి దృష్టికి తీసుకువెళ్లారు. రెండు రోజుల పాటు ఆకివీడులోని బాలసదన్‌లో ఉంచి, వారి తల్లిదండ్రులు రాకపోతే ఏలూరులోని హోమ్‌కు తరలించాలని సూచించారు. దీంతో బాలికను స్థానిక బాలసదన్‌లో ఉంచారు. బాలికను గుర్తించి, తల్లిదండ్రులు బాలసదన్‌కు వచ్చి తీసుకువెళ్లాలని రత్నకుమారి విజ్ఞప్తి చేశారు.

మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు


యండగండిలో మేకలకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న దృశ్యం

ఉండి: మేకలు, గొర్రెలకు చీడ పారుడు వ్యాధి రాకుండా పీపీఆర్ టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ప్రియాంకరాబర్ట్, యండగండి గ్రామ సర్పంచ్ గోగులమండ చినకృష్ణమూర్తి అన్నారు. శుక్రవారం యండగండిలో మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకాలు వేసే కార్యక్రమాన్ని గ్రామ సర్పంచ్ చినకృష్ణమూర్తి ప్రారంభించి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ప్రజల ప్రాణాలకే కాకుండా పశువుల ప్రాణాలకు కూడా ఎక్కడా అపాయం కలుగకూడదని ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. గతంలో పశువుల ఆసుపత్రులు అలంకార ప్రాయంగా ఉండేవని ఇప్పుడు ప్రతీ ఆసుపత్రికీ డాక్టర్‌తో పాటు, సిబ్బందిని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మేకలు, గొర్రెలకు పీపీఆర్ టీకా వేయించడం ద్వారా చీడపారుడు వ్యాధి కాకుండా తినే ఆహారం పూర్తిగా జీర్ణం అవుతుందని అప్పుడు పశువు పూర్తి ఆరోగ్యంతో ఉంటుందని వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో గ్రామంలోని 225 గొర్రెలకు,50 మేకలకు పీపీఆర్ టీకాలు వేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. ఈ నెలాఖరులోగా అన్ని గ్రామాల్లోను పీపీఆర్ టీకాలు వేస్తామని, పశురైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది గంగరాజు, రవి, అనిల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టు మెషీన్లు పంపిణీ


కుట్టు మెషీన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: ప్రతి ప్రాణికీ మరణం తథ్యమని, జనన మరణాల మధ్య చేసిన దాతృత్వకార్యాలే మనిషి శాశ్వత కీర్తికి చిరస్థాయిగా నిలుస్తాయని, అలాంటి కోవకు చెందిన పాలూరి రామూర్తి దాతృత్వానికి మారుపేరుగా నిలుస్తారని భీమవరం యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ ఎం.నిర్మలా జ్యోతి అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక అధ్వర్యంలో దివంగత పాలూరి రామూర్తి పేరిట వారి కుమారులు నలుగురు పేద మహిళలకు కుట్టు మెషీనులను అందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. త్యాగరాజ భక్త సభ సభ్యులు చెరుకువాడ వెంకట్రామయ్య మాట్లాడుతూ పాలూరి వారి కుటుంబానికి ఈ ప్రాంతంలో ఒక స్థానం ఉందని, దానిలో రామ్మూర్తి ప్రదములని అన్నారు. నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ రామ్మూర్తి కుమారులు శివరావు, సూరిబాబు, కిషోర్‌ల ఆర్థిక సహకారంతో నలుగురు పేద మహిళలకు కుట్టు మెషీన్లు ఉచితంగా అందించారని, ప్రతి ఏటా వారి తల్లిదండ్రులు పేరిట దాతృత్వ కార్యక్రమాలను నిర్వహిస్తామని తెలిపారన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ అయ్యగారి శ్రీరామ్, పాలూరి సుధ, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.నాగలక్ష్మి

ఆకివీడు: బాల్యానికి బంగారు భవిష్యత్ ఉందని, దానిని తుంచివేయవద్దని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.నాగలక్ష్మి అన్నారు. మండలంలోని చెరుకుమిల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు, బాలురకు అవగాహనా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండకుండానే బాలికలకు వివాహాలు చేయడం ద్వారా వారిలో అవయవ లోపాలు పెరుగుతాయన్నారు. శారీరక లోపాలతో భవిష్యత్ ఇబ్బందుల పాలవుతుందని చెప్పారు. 18 ఏళ్లు నిండిన యువతులకు, 21 ఏళ్లు నిండిన యువకులకు మాత్రమే వివాహం చేయాలని ఆమె సూచించారు. మైనర్లకు వివాహం చేయడం నేరమని, బాల్య వివాహ చట్టం ద్వారా వారిపై పోక్సో కేసులు నమోదు చేస్తారని హెచ్చరించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించినా, చేసినా నేరమేనని జరిమానా, జైలు శిక్షపడుతుందన్నారు. బాల్యవివాహాలు ఎక్కడ జరిగినా సంబంధిత గ్రామ అధికారులకు తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం. భువనేశ్వరరావు, ఉపాధ్యాయులు, కేఎంఎస్‌కే గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ వద్ద సీపీఐ నాయకుల ధర్నా


ఉండి ఎస్‌బీఐ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

ఉండి: దేశంలో పేదల సంక్షేమాన్ని విస్మరించి ధనవంతులకు అనుకూలంగా కేంద్రప్రభుత్వం బడ్జెట్‌ను రూపొందించి ప్రజా వ్యతిరేక బడ్జెట్‌ను ప్రవేశపెట్టిందని సీపీఐ మండల కార్యదర్శి కలిశెట్టి వెంకట్రావు అన్నారు. సీపీఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఉండి ఎస్‌బీఐ వద్ద సీపీఐ నాయకులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి కేంద్ర ప్రభుత్వం నిధుల కోత విధించడం పేదలకు చేస్తున్న అన్యాయమని అన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పతివాడ గణపతి,సనపల శ్రీను,కొడవర్తి రమేష్,మంతెన కృష్ణ,కలిశెట్టి శ్రీను,కామన కొండ,బొండాడ నాగరాజు,వర్ధిపర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

భీమవరంలో..
సాక్షి, భీమవరం: గౌతం అదానీ ఆస్తులు జప్తు చేసి, జాయింట్ పార్లమెంటరీ కమిటీతో విచారణ జరిపించాలని సీపీఐ పశ్చిమ గోదావరి జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు డిమాండ్ చేశారు.సీపీఐ రాష్ట్ర పిలుపులో భాగంగా శుక్రవారం భీమవరంలో సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద ధర్నా నిర్వహించి డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని బ్యాంకు మేనేజర్ కు అందజేశారు. కార్యక్రమంలో చెల్లబోయిన రంగారావు, ఎం.సీతారాం ప్రసాద్, యస్.పుష్పకుమారి, బి.సత్యనారాయణ, మల్లుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.